# ఇల్లు దొరికింది!

—శ్యామల జయరామరెడ్డి.

నాకు ఇల్లు దొరికింది!

కంట్రోలు రేటుకి కిర్సనాయిలు దొరికినా, గవర్నమెంటాస్పత్రిలో మందు దొరికినా, పోగొటుకున్న పరుసు దొరికినా స్టేట్ బాంకిలో కొత్త రూపాయి నోట్లిచ్చినా ఆశ్చర్య పడక్కర్లేదు గాని, ఈ టౌన్లో అద్దెకి ఇల్లు దొరికిందంటే ఆశ్చర్యమే మరి! అందులోనూ నాకు దొరికిన ఇల్లు కారు చౌక, నెలకు పాతిక రూపాయలు. పైగా అన్ని సౌకర్యాలూ ఉన్నాయి!

ఆ ఇల్లు మా ఆవిడకి నచ్చింది!

ఇది మరీ ఆశ్చర్యం! నిజం! ఎవరో అంటే నే చచ్చినా నమ్మను. ఇల్లు చూట్టానికి నాతో వచ్చిన మా ఆవిడే స్వయంగా నాతో అన్నది "ఇల్లు బలే బాగుందండీ" అని. అప్పుడు నాకేమనిపించిందో తెలుసా? కాలరు పైకెత్తుకొని తిరగాలనీ, మా ఆవిడ లేకుండా జామ్మని రెండో ఆట సినిమాకెళ్ళిపోవాలనీ మా ఆఫీసు టైపిస్టుని "హాయ్ లిల్లీ" అని పలకరించాలనీ అనిపించింది....కాని ఆ రోజు కారోజే కొత్త ఇంట్లోకి మారిపోవాలని మా ఆవిడ పట్టుపట్టడంతో సామానుమార్చటంలోనే సరిపోయి వీలు చిక్కలేదు. రాత్రి తొమ్మిదయ్యే సరికల్లా పాత ఇల్లు ఖాళీ చేసి పారేసి సామానంతా కొత్తింట్లోకి మార్చేసాను. పొద్దుపోయినా విసుక్కోకుండా నాకు ఇష్టమైన గోంగూరపులుసు చేసి భోజనంపెట్టింది మా ఆవిడ. పడుకోబోయేముందు తలనిండా మల్లెపూలు పెట్టుకొనివచ్చి అడక్కపోయినా ఓ ముద్దుకూడ ఇచ్చింది!.... ఛీ పాడు, ఇలాంటివన్నీ మీతో చెప్తున్నానేమిటి?

అసలీ ఇల్లు మార్చే గొడవ ఎందుకొచ్చిందంటే - ఇదివరకు ఉంటూన్న ఇల్లు బాగా లేక కాదు. రెండురోజుల క్రితం మా పక్క వాటాలోకి కొత్తగా దిగిన ఆవిడ మొగుడికి నా కంటే ఓ పది రూపాయల జీతం ఎక్కువట! ఆవిడగారు మా ఆవిడగారి కంటే కొంచెం ఎరుపట! మా ఆవిడకి ఐదు చీరెలుంటే ఆవిడకి ఆరు చీరెలున్నాయట! ఆవిడ మొగుడు రోజూ ఇంటికొచ్చేప్పుడు మల్లెపూలు కొనుక్కొస్తాడట! అలాంటి పొరుగుతో మా లాంటి మర్యాదస్తులం ఎలా కాపరం చేస్తాం చెప్పండి? అందుకని మా ఆవిడ నాతో పోరు పెట్టుకొని మూడవ రోజుకి ఇల్లు మార్పించేసింది. ఇల్లు గలవాళ్ళు వొక వాటాలో ఉంటూ పెద్ద వాటా మాకు అద్దెకిచ్చారు.

ఆ ఇల్లు గలావిడ కూడ మా ఆవిడకి నచ్చింది!

ఆ కొత్తింట్లో చేరిన రెండో రోజు నుంచే ఇల్లు గలావిడ మా ఆవిడకి మహా ఆప్తురాలై పోయింది. ఆవిడ నామజపంతో మా ఇల్లు పునీతం చెయ్య సాగింది మా ఆవిడ—సుందరక్క చెప్పిందండీ, పోపులో ముందు మినపప్పు వేసిన తర్వాత ఆవాలు వేస్తే పోపు ఘుమ ఘుమ లాడుతుందట—సుందరక్కకు మైసూర్‌పాక్ చెయ్యటం కూడా వచ్చండీ—నోము సినిమా బాగుందట, సుందరక్క చెప్పింది—అయ్యో, మీ ఒళ్ళు వెచ్చగా ఉందే! ఉండండి సుందరక్క నడిగొస్తాను ఈ పూట ఏం పెట్టమంటుందో మార్కెట్‌కి వెళుతున్నారుగా, అలాగే సుందరక్కకుకూడా ఓ అర కిలో బెండకాయలు తెచ్చి పెట్టండీ పాపం! అప్పుడు తెలిసింది నాకు ఇల్లు గలావిడ పేరు సుందరో లేక సుందరమ్మో అని. నిజానికి ఆవిణ్ణి నేనింతవరకూ చూడలేదు. అదేమిట్లో గాని మా ఆవిడకి ఆప్తులైన వాళ్ళంతా నాకు ఇందిరాగాంధీ కంటికి జయప్రకాశ్ నారాయణలా కనిపిస్తారు.

ఆవిడగారి దర్శనమైతే నాకు ఇంత వరకూ కాలేదు గాని ఆవిడ ప్రభావం మాత్రం మా ఇంట్లో మూల మూలనా కనుపించసాగింది. మా ఆవిడ చేసే కూరల రుచి మారిపోయింది. కారం ఎక్కువై నాలుగు రోజులపాటు విరేచనాలు పట్టుకున్నాయి నాకు. కూరల్లో శెనగనూనె వాడడం మానేసి నువ్వుల నూనె వాడటం మొదలెట్టింది. చక్కగా జెడ వేసుకోవడం మానేసి మంగళగిరి గోపురంలా నడినెత్తిన చుట్ట చుట్టుకోవటం ప్రారంభించింది. మంచం కింద ట్రంకుపెట్టె వంటింట్లోకి మారిపోయింది. మా ఆవిడ ఉపయోగించే ఊత పదాలు, రాసుకునే పౌడరు, రుద్దుకొనే సబ్బు – అన్నీ మారిపోయాయి. అదేమిటంటే "సుందరక్క చెప్పిందండీ, ఆ కంపెనీ మంచిది కాదుట!" అని జవాబు. ఆ మార్పు మొగుడు వెధవనైన నా వరకూ రానంతవరకూ నాకేం ఇబ్బంది లేదు. పైగా నాకెంతో హాయిగా కూడ ఉన్నది. ఎందుకంటే ఈ ఇంట్లోకి వచ్చినప్పట్నుంచి ఇరుగు పొరుగు ఆడవాళ్ళతో మా ఆవిడకి గిల్లికజ్జాలు, రాత్రిపూట నిద్రపోనీయకుండా వాళ్ళమీద చెప్పే నేరాలూ వినేబాధ తప్పిపోయింది నాకు. 'సుందరక్క' పుణ్యమా అని గృహమే కదా స్వర్గసీమా అంటూ కాపరం చేసుకుపోతున్నాను...ఇంకేం, అంతా శుభాంతమైపోయింది కదా కథ అయిపోయిందనుకొంటున్నారేమో మీరు తప్పు తప్పు. కథ ఇక్కడ గొప్ప మలుపు తిరిగి ఏట్లో కలవబోతోంది. "దేవరన్నెమ్మదిగా నడుపుము!" పాఠక మహాశయా, నిశ్శబ్దముగా నా వెంటరమ్ము! అంధకార బంధురమై, రహస్య కవాట మయమై, అరి నిర్భేద్యమైన మానవ మస్తిష్కపు పొరలలోనికి మనమిప్పుడు అడుగిడ బోవుచున్నాము భయపడుచుంటిరా?....

ఉన్నట్టుండి వొకరోజున మా ఆవిడ విసురుగా కాఫీ గ్లాసు బల్లమీద పెట్టి "ఛీ ఛీ, ఏం మనుషులండీ వీళ్ళు!"

అన్నది. ఎవరూ? ఏమిటీ? అని నేను అడుగలేదు. అడిగానంటే సీరియల్ నవల మొదలెడుతుందని నా భయం. గత అనుభవం. అంతలో పోపు మాడి పోయిన వాసన రావటంతో వంటింట్లోకి పరుగెత్తింది.

సాయంత్రం నేను ఆఫీసునుంచి ఇంటికి రాగానే కాఫీ ఇచ్చి, స్టౌ ఆర్పేసి వంటింట్లోకి కాకులుదూరకుండా తలుపులు బిగించి,తను చెప్పబోయేదానికి ఏ అవరోధమూ రాకుండా మరికొన్ని జాగ్రత్తలు తీసుకొని, నా ఎదురుగా చాపమీద కూర్చుని తాపీగా జెడ విప్పు కొంటూ "నాకు వొళ్ళుమండుతూందండీ. చెప్పేది శ్రీరంగ నీతులు దూరే వి దొమ్మరి గుడిసెలూ నట_" అంటూ ప్రారంభించింది. ఉపోద్ఘాతం మా ఆవిడ చచ్చాం.నేను వినకుండా తప్పించుకు పోయే మార్గాలన్నీ జాగ్రత్తగా బంధించి వచ్చింది. ఇహ తప్పదురా బాబూ అనుకొని భగవత్ ప్రార్థన మొదలెట్టే సరికి 'సిరికిం జెప్పడు' అన్నట్లు విష్ణుమూర్తిలా మా ఆవిడ తమ్ముడు ఊర్నించిఊడిపడ్డాడు'అక్కా' అంటూ. మా ఆవిడ రాకరాక వొచ్చిన తమ్ముణ్ణి చూసి చాటంత ముఖం చేసు కొని కాళ్ళకు నీళ్ళిచ్చి, పుట్టింటి కుశల ప్రశ్నలు అడగడంతో అసలు విషయం మర్చిపోయింది.

రాత్రి భోజనాలు చేసి, బావ్మరిదితో కాసేపు కబుర్లు చెప్పి, బాత్‌రూమ్‌కి వెళ్ళి ఆవులిస్తూ బయటికొస్తున్న సమయంలో మాఆవిడ ఎదురై "మీ మంచం లోపల గదిలో వేసానండీ" అన్నది కొత్తగా కాపరానికొచ్చిన కోడలుపిల్లలే సిగ్గు నటిస్తూ. ఆహా! ఏమి నా అదృష్టం – అనుకొంటూ గదిలోకి వెళ్ళి దర్జాగా శయ్య నలంకరించాను. ఐదు నిమిషాల్లో ఇల్లంతా సర్దేసి వచ్చింది. మా ఆవిడ మల్లెపూలు, కాశ్మీర్ స్నో, పాండ్స్ పౌడరు వాసన లన్నింటినీకట్ట కట్టుకొని మోసుకొస్తూ, వస్తూనే "అవతలకు జరగండీ" అంటూ నన్ను పక్కకునెట్టి, మూడొంతుల మంచాన్ని ఆక్రమించి "ఇల్లు గలావిడ లేమూ"... అంటూ ఉపోద్ఘాతం లేకుండానే మొదలెట్టింది. ఓసి నీ తెలివి మండా, ఇందుకా గదిలో మంచం వేసిందీ, అని నేను మా ఆవిడ తెలివికి ఆశ్చర్య పడుతూ ఉండగనే "...మంచిదికాదండీ" అని పూర్తి చేసింది వాక్యాన్ని.

నిజం చెప్పొద్దూ, నాకు భలే ఇంట రెస్టు పుట్టుకొచ్చింది ఎందుకోగాని 'ఫలానావిడ మహా పతివ్రత' అంటే కలుగని ఇంటరెస్టు 'ఫలానా కమల చెడ తిరుగుతుందండీ' అంటే పుట్టుకొస్తుంది. నేను ఉత్కంఠతో లేచి కూర్చుని "ఛా..." అన్నానుఉత్సాహాన్ని బయటకు కనబడనీయకుండా.

"నిజమండీ, పంపు దగ్గర మిషను కుట్టే కోటేశ్వరరావు లేడూ, వాడితో పోతుందట!" అన్నది మా ఆవిడ.

"ఛాఛా నేన్నమ్మను. ఆవిడ అలాంటిది కాదు" అని ఓ సర్టిఫికేట్ పడేశాను. నిజానికి ఆవిణ్ణి గురించి నాకేమీ తెలియక పోయినా అలా అంటే గాని అసలు విషయాలన్నీ బయటపడవు.

"పిచ్చి మా రాజులు మీకేం తెలు

సండీ ! అత నొక్కడే కాదుట ! ఎదురింటి సీతమ్మ అల్లుడు లేడూ-ఇల్లరికం ఉంటున్నాడే- అతనితో కూడ గ్రంథం సాగిస్తోందట !"

"అవ్వవ్వ ! ఆవిడ కిదేం పని ? మొగుడున్నాడుగా !" అన్నాను.

"ఖర్మ మీకేం తెలియదు. చేసే వాళ్ళంతా మొగుళ్ళు లేకనే చేస్తున్నారా? పుట్రైన పుటిన బుద్ధండీ, పుడకలతో గాని పోదు !"

"ఇవన్నీ నీకెలా తెలుసూ ?" మా ఆవిడ తెలివిని మెచ్చుకొన్నట్లు నటిస్తూ అడిగాను.

"మనింట్లో అంట్లుతోమే అప్పల నరసమ్మ లేదూ, అది చెప్పింది. పదేళ్లగా అది ఈ బజార్లోనేగా పనిచేసేది. దానికి తెలియని సంగతులుండవు !"

"కలికాలమే - కలికాలం. నేనింకా ఆవిడో మహా సాధ్వి అనుకొంటున్నాను సుమా" అన్నాను.

"అందుకేనండీ మనకీ కొంపవద్దు. మరెక్కడైనా ఓ ఇల్లు చూడండి మారిపోదాం" అని అసలు సంగతి బయట పెట్టింది మా ఆవిడ.

నా గుండె గుభేలు మన్నది. ఈ ఊళ్లో అద్దెకి ఇల్లు దొరకటం సులభమను కొంటూందేమొ? ఈ ఇంట్లో చేరి పదిహేను రోజులు కూడ కాలేదు. అప్పుడే ఇల్లు మార్చడమా? అయినా ఇల్లుగలావిడ మంచిది కాకపోతే మనకేం? ఇలాంటి ఇల్లు మళ్ళీ దొరకొద్దూ? — అంటూ నచ్చచెప్పబోయాను. మా ఆవిడకి. కాని వినిపించుకొంటేగా ? "అసలు మీకేం తెలియదు. ఇలాంటి అలగాజాతి పొరుగున నేను ఒక్కక్షణం కూడ ఉండను. రేపు ఆదివారమేగా—మరో ఇల్లు చూడండి. అంతే!" అని, దుప్పటి ముసుగు తన్ని, మరో క్షణంలోనే గుర్రుపెడుతూ నిద్రపోయింది. ఇక రేపు ఇంటికోసం కాళ్ళీడ్చుకొంటూ ఊరంతా తిరగ వలసినవాణ్ణి నేనేగా ? యేం ఖర్మరా బాబూ అనుకొంటూ రాత్రంతా జాగారం చేశాను. ఎప్పుడో తెల్లవారు జామున కాస్తంత కలత నిద్ర పట్టింది.

ఉదయం కాస్త ఆలస్యంగా మెలకువొచ్చే సరికి మా ఆవిడ వంటింట్లో తప్పేళాలతో సంగీతం పాడించేస్తూంది. హఠాత్తుగా ఇల్లుగలావిడను గురించి మా ఆవిడ చెప్పిన విషయం గుర్తొచ్చింది అదేమిటో అప్పటివరకూ లేనిది ఆవిణ్ణి చూడాలనే కోరిక నాలో బలంగా కలిగింది. ఇంటి వెనుక ఖాళీ జాగా మా రెండు వాటాలకూ కామన్. అందులోనే బావి కూడ వున్నది. నీళ్లుచేదుతూన్నట్లు గిలక చప్పుడు వినిపించింది. ఇల్లుగలావిడే అయి వుండాలి. మెల్లగా పిల్లిలా దొడ్లోకి వెళ్ళాను. ఆవిడే ! పైటచెంగు నడుం చుట్టూ బిగించి నీళ్లు చేదుతోంది ఈ ఇంట్లోకి వచ్చి ఇరవై రోజులైనా ఆవిడెప్పుడూ నా కంట పడ లేదు. నేనా సమయంలో ఎప్పుడూ దొడ్లోకి వెళ్ళనూ వెళ్ళను. ఇవ్వాళ ఆవిణ్ణి చూసేసరికి ఎంతో ఆశ్చర్యం వేసింది...

మా ఆవిడ 'సుందరక్క- సుందరక్క'- అంటూంటే బాగా వయసు మళ్ళినావిడేమో ననుకున్నాను. పిల్లా జెల్లా లేరేమో, యవ్వనంతో పిటపిట

లాడుతోంది. తడిసిన జాకెట్టు వొంటికి అతుక్కుపోయి మరీ అందంగా కనుపిస్తూంది. రాత్రి మా ఆవిడ చెప్పిన విషయం మనసులో పురుగులా తొలుస్తోంది మీతో అబద్ధమెందుగ్గాని.... ఆ క్షణంలో నాలో దుర్బుద్ధి పుటనే పుట్టింది. చెంబుతీసుకొని బావి దగ్గరగా వెళ్ళి చిన్నగా దగాను. ఆవిడ తల తిప్పి నా వేపు చూసి, సిగ్గుపడుతూ తమ వాటాలోకి వెళ్ళిపోయింది. కింది పెదవి మునిపళ్ళతో నొక్కిపట్టి వచ్చే నవ్వును ఆపుకొంటూన్నట్లు కూడ అనిపించింది నాకు. గుండె నోట్లోకి వచ్చి నోరు తడారిపోయింది.

స్నానంచేసి కాఫీ తాగి బయటికెళ్ళబోతూ ఉండగా, "ఏమండోయ్, ఇంటి విషయం మర్చిపోయేరు" అంటూ గుర్తుచేసింది మా ఆవిడ. 'అందుకే వెళ్తున్నాను. అని ఓ అబద్దం ఆడేసి బయటపడ్డాను. అంతా వొట్టిదే. ఇల్లూలేదు పాడూలేదు సాంబిగాడింట్లో సిగరెట్లు పందెంపెట్టి మధ్యాహ్నందాకా పేకాడి, ఎంతో అలసిపోయినట్లు ఇంటికి చేరాను. అసలు ఇల్లు మార్చాలని నాకుంటేగా ?

వారం రోజులు గడిచిపోయాయి. మా ఆవిడ రిమైండర్లూ, జి. వో. లూ ఇచ్చేస్తూంది. రెండుమూడు రోజులుంటే సత్యాగ్రహంకూడ మొదలెట్టేట్టుంది.

నేను ప్రతిరోజూ ఆలస్యంగా నిద్రలేవటం అలవాటు జేసుకున్నాను-ఎందుకంటే ఆ సమయానికి ఇల్లుగలావిడ బావి దగ్గరకొస్తుంది. మా ఆవిడేమో వంట పనిలో మునిగిపోయి ఉంటుంది. నా ప్రయత్నాలు కొంతవరకూ ఫలించాయి. ఇల్లుగలావిడ ఇప్పుడు నన్నుచూసి తమ వాటాలోకి పారిపోవటం లేదు. వొకరోజు మెల్లగా పలకరించాను. సమాధానం చెప్పలేదుగాని తిట్టకుండా వెళ్ళిపోయింది. అంటే బండి దారిలో పడినట్లేగా ?

ఇంటి విషయంలో నేను అబద్ధం చెప్తూన్నట్లు మా ఆవిడకి అనుమానం కలిగిందో ఏమిటోగాని వొకరోజు పోట్లాట వేసుకుంది. "నా మాటంటే మీకు చీమ కుట్టినట్లయినా లేదు. మీరు మరో ఇల్లు చూస్తారా, నన్ను ఉరేసుకొని చావమంటారా ?" అని

"చూస్తున్నానే, చూస్తున్నాను. రోజూ కాళ్ళు అరిగిపోయేలా తిరుగుతున్నాను. ఎక్కడా ఖాళీ లేందే చావ మంటావా ? రెండు రోజులు వోపిక పట్టుమరి" అన్నాను.

మామూలుగా అయితే మా ఆవిడ నోటికి భయపడి ఎక్కడో ఒకచోట సాయంత్రానికల్లా ఇల్లు మాట్లాడేవాణ్ణే ! కాని అవతల అంతకన్నా బలమైన ఆకర్షణ సూదంటురాయిలా నన్ను లాగుతూంది.

మరో నాలుగు రోజుల తర్వాత మా ఆవిడ విసిగిపోయి "ఈ ఇంట్లోంచి మారిపోతేనే నేను మీతో మాట్లాడేది" అని ప్రతిన పట్టేసింది. ఓయస్ అలాగే కానీయ్ అనుకొన్నాను. నాకేం నష్టం ?

ఈ లోపల నా ప్రయత్నాలు ఫలించబోయే సూచనలు కుప్పలు తెప్పలుగా కనిపించసాగాయి. నేను బయటికెళ్తూంటే ఇల్లుగలావిడ వీధి వాకిట్లో నిలబడి నా వేపు వోర చూపులు విసరటం, ఉదయం

నేను బావిదగ్గరకు వెళ్ళడం కాస్త ఆలస్యమైతే పనిమనిషితో బిగ్గరగా మాట్లాడి తన ఉనికిని తెలియజేయటం... ఇక ధైర్యంచెయ్యాలి....ధైర్యే సాహసే లక్ష్మి...

ఆ రోజు మా ఆవిడకి నామీద మరీ కోపం వచ్చిందేమో, తెల్లవారవస్తూన్నా ముసుగు తొలగించలేదు. అడిగితే "నా వంట్లో బాగాలేదు" అని పుల్ల విరిచినట్లు సమాధానం చెప్పి మరీ గట్టిగా ముసుగు దన్ని పడుకుంది. నాకు ఎక్కడ్లేని సంతోషం కలిగింది. ఇది మంచి అవకాశం జారవిడుచుకోకూడదు. ఇంకా పూర్తిగా వెలుగు రాలేదు. అప్పుడే స్నానసంగీనం కానిచ్చి, నున్నగా క్రాఫ్ దువ్వుకొని ఇల్లుగలావిడకోసం నిరీక్షించ సాగాను.

పది నిముషాల్లోనే గిలక చప్పుడు చెవులబడింది, మధురాతిమధురంగా. నవవధూసమాగమానికి వెళ్ళే కావ్యనాయకుడిలా బావి వద్దకు నడిచాను. ఇల్లుగలావిడ నీళ్లు తోడుకొంటూంది. నేను ఆవిడ తోడిన నీళ్ళతోనే మరోసారి సబ్బుతో ముఖం కడుక్కొని, ఏవో నాలుగైదు పొడిమాటలు మాటాడి, ధైర్యంచేసి ఆవిడ చెయ్యిపట్టుకున్నాను.

సగం వరకూ లాగిన బకెట్ అలాగే బావిలోకి వదిలేసింది ఆవిడ. నా చెంప ఛెళ్ళుమన్నది! కళ్ళ ముందు వెలుగు చక్రాలు గిర్రున తిరిగాయి. ఆటంబాంబు పేలితే అలాగే ఉంటుంది కాబోలు? "నీకు బుద్ధి లేదూ? మనిషివి కాదూ? అక్కాచెల్లెళ్ళు లేరూ?" అని నానా శాపనార్థాలు పెడుతూ తమ వాటాలోకి వెళ్ళిపోయింది!

ఇంకా నయం. నా అదృష్టం చాల మంచిది. వాళ్ళాయనగాని, నా పెళ్ళాం గాని చూడలేదు. తప్పుడు సమాచారం అందించినందుకు మా ఆవిణ్ణి తిట్టుకొంటూ పిల్లిలా ఇంట్లో దూరాను.

మా ఆవిడ ఎప్పుడు లేచిందో ఏమిటో—నేను లోపలికి వెళ్ళేసరికే కాఫీ కాసేసి గ్లాసుల్లోకి వొంపుతూంది. నన్ను చూడగనే నవ్వుముఖంతో కాఫీగ్లాసు అందించి "తాగండీ, చల్లారి పోతున్నాయి" అన్నది ఎంతో ప్రేమగా. నాతో అసలు మాట్లాడనని పంతం పట్టిన మనిషి ఆప్యాయంగా కాఫీగ్లాసు అందివ్వడమేమిటీ? ఏమిటో ఈ ఆడవాళ్ళ మనస్తత్వం నాకు అంతు బట్టి చావదు!

గబగబా బట్టలేసుకొని బయటపడి, ఆఫీసులో నైట్‌వాచ్‌మన్‌కి సెలవు చీటీ ఇచ్చేసి ఊరిమీద పడ్డాను ఇంటికోసం. ఆ వేళ మధ్యాన్నం భోజనానికూడ ఇంటికి వెళ్ళలేదు. హోటల్లోనే నాలుగు మెతుకులు తిని, మళ్ళీ ఊరుమీద పడి, వొళ్ళంతా హూనం చేసుకొని, ఎలాగో సాయంత్రనికి వొకయిల్లు పట్టుకోగలిగాను. వెంటనే అద్దె మాట్లాడుకుని ఇవ్వాళ రాత్రికే వచ్చి చేరిపోతామని ఇంటి ఆసామితో చెప్పి, నెల అద్దె అడ్వాన్సు ఇచ్చేసి, తేలిక పడ్డ మనస్సుతో ఇల్లుచేరాను. అదృష్ట వశాత్తు ఇల్లుగలావిడ వీధి వాకిట్లో లేదు.

మా ఆవిడ చక్కగా స్నానం చేసి, ఇస్త్రీ చీరె సింగారించి, తలనిండా పూలు పెట్టుకొని నా కోసం ఎదురు చూస్తూ

నిలబడింది.

నేను ఇంట్లోకి వస్తూనే "ఇల్లు మాట్లాడాను. సామానుసర్దు ఈ రాత్రికే మారిపోదాం" అన్నాను.

మా ఆవిడ ఆశ్చర్యం నటిస్తూ "ఇల్లే మిటీ ?" అన్నది.

నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. "అదేమిటి, పదిహేను రోజుల్నుంచీ ఇల్లు మార్చమని ఒకటే పోరు పెట్టా వుగా ?" అన్నాను.

"పోనిద్దురూ ఈ ఇల్లు బాగానేఉంది. మళ్ళీ యిప్పుడు మార్చట మెందుకు బాబూ అనవసరం!" అన్నది సన్నాయి నొక్కులు నొక్కుతూ.

ఏమిటీ దీని అర్థం ? కొంప దీసి ...ఔను. నేనప్పుడు గమనించలేదుగాని, ఇల్లుగలావిడ చెయ్యి నా చెంప నిమురుతున్నప్పుడు మా వాటా కిటికీలో ఎవరో నిలబడి ఉండటం ఇప్పుడు లీలగా గుర్తు కొచ్చింది. ఎవరో అలా ఉండటానికి వీల్లేదు. మా ఇంట్లో వుండేది నేనూ మా ఆవిడే మరి!

---

భార్య : ఏమండోయ్ అప్పుడే ఎక్కడికి బయల్దేరారు?

భర్త : ఛా! అపశకునం కూత కూశావు. వెళ్ళిన పని కాకపోని చెప్తా.

భా. : ఏమిటండీ అది ?

భ. : వంటిల్లు తప్ప నీకేం తెలుసునే ? "అనామిక" కోసం వెళ్తున్నా.

భా. : తెల్లారకముందే సినిమా ఏమిటండీ.

భ. : అబ్బే 'అనామిక' అనే క్రొత్త మాసపత్రిక వచ్చింది. ఆలస్యమయితే కాపీలు దొరకవు.

భా. : అయితే నడిచివెడితే ఆలస్యం అవుతుందేమో సైకిల్ మీద వెళ్ళిరండి.

---